క్లుప్తంగా

కారు ఢీకొని ఒకరికి గాయాలు

మునగపాక: మండల కేంద్రంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సైక్లిస్టుకు తీవ్రంగా గాయపడ్డాడు. మునగపాక దళితవాడకు చెందిన బోడపాటి గంగాధర్ తన సైకిల్‌పై వస్తుండగా ఎంఎస్ఆర్ నేషనల్ డిగ్రీ కళాశాలకు ఎదురుగా అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపు వస్తున్న కారు ఓవర్‌టేక్ చేసే క్రమంలో సైకిలిస్టును ఢీ కొంది. ఈ సంఘటనలో సైకిల్‌పై వస్తున్న గంగాధర్ తలకు గాయాలయ్యాయి. స్థానికులు గంగాధర్‌కు సపర్యలు చేసి మునగపాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రహదారికి ఇరువైపులా డ్రైనేజీల ఏర్పాటు

మునగపాక : తోటాడ పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రస్తుతం ఉన్న కాలువలను ఎత్తు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం పంచాయతీ పరిధిలోని గవర్ల అనకాపల్లి రామాలయం నుంచి జంక్షన్ వరకు ఉన్న రహదారిని ఇటీవల పునర్నిర్మాణం చేసిన సంగతి తెలిసిందే. రహదారిని ఆనుకొని కాలువలను ఎత్తు చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాగలదని ఇందుకు అధికారులు సహకరించాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఉమామహేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము,వార్డు సభ్యులు రవి,మణి పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితులకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

రాంబిల్లి: నేవీ నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నేవీ మెయిన్‌గేటు వద్ద 8 గ్రామాల ప్రజలు నిర్వహిస్తున్న ధర్నా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అప్పారావు, మండల అధ్యక్షుడు అప్పలరాజు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : ఉపాధిహామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. అరబుపాలెంలో ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జితో కలిసి ఆయన ఉపాధిహామీ పథకం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వలస కూలీలను నివారించేందుకు ఉపాధిహామీ పథకం దోహదపడుతుందన్నారు. ఈ పథకం ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొడ్డి బుజ్జి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొయిలాడ ఎర్రయ్యనాయుడు, కూర్మారావు,ఫీల్డ్ అసిస్టెంట్ ఆడారి గణేష్ పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించాలి

నక్కపల్లి : స్థానిక డిగ్రీ కాలేజీలో అధ్యాపకులను నియమించడంతో పాటు నూతన భవనాలను నిర్మించాలంటూ అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు కోరారు. సోమవారం వీరు కాలేజీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ కాలేజీ మంజూరు చేసారని అధ్యాపకుల తోపాటు, నూతన భవనాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ డిమాండ్లునెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రమణ, బాబ్జి, భువనేశ్వరి పాల్గొన్నారు.

రహదారి విస్తరణ బాధితుల వివరాల నమోదు


బాధితుల వివరాలు నమోదు చేస్తున్న రెవెన్యూ అధికారులు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట సచివాలయంలో సోమవారం పూడిమడక రోడ్డు విస్తరణ బాధితుల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. బాధితుల బ్యాంక్ ఖాతాలోకి నేరుగా నగదు జమ అయ్యేందుకు అవసరమయ్యే చర్యలను వీఆర్వో రమేష్ చేపట్టారు. బాధితుల వివరాలతో పాటు వారి బ్యాంకు ఖాతా నంబర్లు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, బాధిత రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు


భోగాపురంలో గడప గడపకు కార్యక్రమంలో యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు


వాకింగ్ ట్రాక్ చుట్టూ మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని భోగాపురంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబురాజు)అన్నారు. సోమవారం భోగాపురం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల ఆక్రమణ వ్యవహారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన పై విధంగా స్పందించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధి గురించి ఆరా తీశారు. గడిచిన మూడేళ్లలో సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, అర్హుల గురించి ప్రశ్నించారు. ఎవరికైనా న్యాయం జరగకుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నవరత్నాల కరపత్రాలను అందజేశారు. అనంతరం వలంటీర్లతో సమావేశమై స్థానిక సమస్యల గురించి చర్చించారు. వలంటీర్లకు బ్యాగ్‌లను ఎమ్మెల్యే కన్నబాబురాజు సొంత నిధులతో అందజేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీపీ భర్త కోన బుజ్జి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, భోగాపురం స్థానిక నేతలు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

యలమంచిలి : వాకింగ్ ట్రాక్‌లు శారీరక వ్యాయామనికి ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. సోమవారం యలమంచిలి త్రిమూర్తులు స్వామి వారి ఆలయం వెనుక ఉన్న చెరువు గట్టు వద్ద నూతనంగా నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ ఆహ్లాదకరమైన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. చెరువు వద్ద మురుగు నీటిని శుద్ధి చేసి శుద్ధ జలాలు ఉండేటట్లు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి పట్టణంలో పాడుబడిన చెరువులను గుర్తించి ఈ వాకింగ్ ట్రాక్‌లు నిర్మాణానికి నిధులు అధిక సంఖ్యలో మంజూరు చేస్తున్నామని, పట్టణ జనాభా శాతం పెరుగుతుండడం ప్రజల అవసరార్థం మహిళలు కూడా ఉదయం, సాయంత్ర సమయాల్లో పట్టణ నడిబొడ్డున వాకింగ్‌కు వీలుగా అధునాతన సౌకర్యాలతో వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నామని,ఇక్కడ పాడుబడిన చెరువుల్లో మురుగు నీరు చేరి దోమలు ప్రబలి దుర్గంధం వెదజల్లేవని, ఇలాంటి చెరువులను గుర్తించి పట్టణ ప్రజలకు వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలన్న సదుద్దేశంతో వాకింగ్ ట్రాక్‌లు నిర్మాణానికి శ్రీకారం చుట్టానని తెలిపారు.

ఇంకొన్ని పాడుబడిన చెరువులను గుర్తించి వాకింగ్ ట్రాక్‌లు నిర్మాణానికి నిధులు మంజూరు చేశానని అన్నారు. సర్వాంగ సుందరంగా ఈ వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం జరగాలని మున్సిపల్ అధికారులకు పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నాగేశ్వరావు, గుప్తా, పట్టణ వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, మున్సిపల్ కౌన్సిలర్లు సత్తిబాబు, గొర్లె వెంకట్ మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, మున్సిపల్ డీఈ వీరయ్య, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, సర్పంచ్‌లు మర్రి రాజుబాబు,గంధం శివ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు

కోటవురట్ల: లక్ష్యం ఉన్నపుడే ఉన్నత స్థాయికి చేరగలమని ఎంఈవో పి.అప్పారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, వాకర్స్ క్లబ్ సభ్యుల సహకారంతో పదో తరగతి విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీ నిర్వహించారు. మండలంలోని పలు హైస్కూల్స్‌కు చెందిన విద్యార్థులు 16 బృందాలుగా క్విజ్ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ కొండబాబు మాట్లాడుతూ తరచూ పోటీలలో పాల్గొనడం ద్వారా భయం, ఒత్తిడి దూరమవుతాయన్నారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రథమ, పాములవాక జెడ్పీ స్కూలు ద్వితీయ, కొత్తకోట తృతీయ, దార్లపూడి నాలుగో స్థానంలో నిలిచాయి.

మురుగుకాలువలో పూడికతీత

రాంబిల్లి: దిమిలి శివాలయం వీధిలో మురుగుకాలువలో పూడికతీత పనులను సోమవారం నిర్వహించారు. ఈ పనులను సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ నగిరెడ్డి మురళీకృష్ణ పర్యవేక్షించారు. మురుగుకాలువ చెత్తాచెదారంతో నిండిపోవడంతో రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సర్పంచ్ చిలుకు స్పందించి పూడికతీత పనులు చేపట్టారు.

నేతన్నలకు ప్రభుత్వం అండ

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు చిరంజీవి

అచ్యుతాపురం(అనకాపల్లి): చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకొంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి అన్నారు. అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరు శ్రీ భద్రవతి చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం కార్యాలయాన్ని సందర్శించిన ఆయన చేనేత కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేతన్న నేస్తం కింద రూ.24 వేల నగదుని సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందిస్తూ చేనేత రంగానికి దన్నుగా ఉంటున్నారని తెలిపారు. చేనేత కార్మికులకు అనేక నామినేటెడ్ పదవులు ఇస్తున్నారని తెలిపారు. అంతకు ముందు సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. నేతన్నలు నేస్తున్న నవారును గంజి చిరంజీవి పరిశీలించారు. చేనేత కార్మికులకు పెన్షన్ వచ్చే విధంగా ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మాడెం నూకరత్నం, సూరి అప్పారావు, పంచుమర్తి లక్ష్మీ భీమేష్, జెడ్పీటీసీ రాంబాబు, ఎంపీపీ భర్త కోన బుజ్జి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, ఉమ్మడి విశాఖ జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు పప్పు రాజారావు, కొప్పల రామ్‌కుమార్, తేలు ఈశ్వరరావు, కులపాక అప్పారావు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నక్కపల్లి : మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం జరిగింది. జగన్నాథపురంలో జరిగిన ఈ సమావేశంలో చైర్మన్‌గా కె.జాన్ డేవిడ్, అధ్యక్షుడిగా మాసా రాజు, ఉపాధ్యక్షుడిగా కె.పాల్, కార్యదర్శిగా రంగంలోరాజు, కోశాధికారిగా కె.ఇస్సాకు, సహాయ కార్యదర్శిగా జి.జోసెఫ్, జాయింట్ కోశాధికారిగా దానియేలు సలహాదారులుగా యోహోషువా, వినయ్ ఎన్నికయ్యారు.

ఘనంగా నల్లమారమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న వైయస్సార్‌సీపీ నేత దాడి రత్నాకర్ దంపతులు

యలమంచిలి : షేకిళ్లపాలెం గ్రామంలో నల్లమారమ్మతల్లి తీర్థ మహోత్సవం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. యలమంచిలి మండలంలో షేకిళ్లపాలెం, కశింకోట మండలంలో అచ్చుతాపురం రెండు సరిహద్దు మండలాల ప్రజలు నల్లమారమ్మ జాతరను నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి వేపచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనకాపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి రత్నాకర్ దంపతులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. జాతరలో జాతీయ రహదారి అనుకుని ఉన్న అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణలు, రంగుల రాట్నాలు, మహిళల కోలాటలు, భజన బృందాలు తోడపెద్దు సేవ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ట్రాఫిక్ అంతరాయం కలగకుండా యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్నిబాబు ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచ్ మరిసా అప్పారావు, గొర్లె నానాజీ పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఆదినారాయణ



మునగపాక: మునగపాక గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పెంటకోట ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి మునగపాక గౌరీ పరమేశ్వరుల ఆలయ ప్రాంగణంలో వచ్చే నెల 4న జరగనున్న ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆలయ గౌరవ అధ్యక్షునిగా పాలిమేర అప్పలనాయుడు, చైర్మన్‌గా పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శిగా ఆడారి అప్పలనాయుడు, కోశాధికారిగా పాలిమేర కృష్ణ, ఉపాధ్యక్షునిగా టెక్కలి కొండలరావు, పెంటకోట సత్యనారాయణ(నానబ్బాయి)తో పాటు మూల సంఘాల నుంచి సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ వచ్చే నెల 4న జరగనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని పెద్దల సహకారంతో ఘనంగా నిర్వహిస్తామన్నారు. అలాగే 1వ తేదీన సారె ఊరేగింపు ఉంటుందన్నారు. గ్రామప్రజలంతా ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల్లో ఆధ్యాత్మికత పెంపొందాలి

ఎస్.రాయవరం : హిందూ మత ఆచార్య సంప్రదాయాలు ఆచరణలు మానవాళికి ఎంతో మేలు కలిగిస్తాయని సమరసత ఫౌండేషన్ మండల కన్వీనర్ శానాపతి సూర్యారావు అన్నారు. తిమ్మాపురం రామాలయంలో సోమవారం హిందూ సంప్రదాయ ఆచరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. హిందూ సంప్రదాయంతో ఇంటి ద్వారబంధానికి పసుపు శాస్త్రీయంగా ఎన్నో కీటకాలు వినాశనానికి ఉపయోగపడతుందన్నారు. అలాగే కట్టుబొట్టు మనిషికి ఎంతో అందాన్నిస్తాయన్నారు. గ్రామాల్లో మరింతగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టి ఆచార సంప్రదాయాలు అలవరచుకునేలా చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

నూతన పంచాగం ఆవిష్కరణ


పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : శ్రీ శోభకృత నామ సంవత్సర పంచాగాన్ని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) సోమవారం యలమంచిలి పార్టీ కార్యలయంలో ఆవిష్కరించారు. స్థానిక గాయత్రి వేద పాఠశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాగ పుస్తకాలను ఎమ్మెల్యే అవిష్కరించి పంచాగ శ్రవణాలు తెలుగు సంవత్సారానికి, సంస్కృతి సంప్రదాయాలకు మూలం అని శ్రీ శోభకృత నామ సంవత్సరంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కార్యకర్తలకు ముందుగా అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొంటూ కార్యకర్తలకు పంచాగ పుస్తకాలను అందజేశారు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, గొర్లె వెంకట్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తోడపెద్దు అచ్చుకు అంకురార్పణ


తోడపెద్దు అచ్చుకు పెళ్లిరాట వేసే కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో సింహాద్రి అప్పన్న ప్రతిరూపంగా కొలిచే తోడపెద్దు అచ్చు(కల్యాణానికి) ఉద్దండపురంలో అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి తోడపెద్దును స్థానిక సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు కుటుంబం కొనుగోలు చేసి ఇచ్చారు. ఈ తోడపెద్దుకు అచ్చువేసే కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో ఎంతో అట్టహాసంగా నిర్వహిస్తారు. చుట్టు పక్కల పది గ్రామాల నుంచి తోడపెద్దు సంబరాలు, తప్పెటగుళ్లు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి తెల్లవార్లు జాగరణ చేసి అచ్చువేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈతోడ పెద్దు కల్యాణోత్సవానికి సంబంధించిన రాటవేసే కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

నేడు అభయాంజనేయస్వామి పండగ

ఉద్దండపురంలో అభయ ఆంజనేయస్వామివారి వార్షికోత్సవ జాతర మంగళవారం జరగనుంది. ఉదయం స్వామివారి ఆలయంలో ఆంజనేయ హోమాలు, తమలపాకు పూజలు నిర్వహిస్తారు. సాంస్కృతిక సంబరాలు, కోలాటాలు, తప్పెటగుళ్లు, తోడపెద్దు సంబరాలు ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది వార్షికోత్సవ సంబరాలతో పాటు, తోడపెద్దు అచ్చు కార్యక్రమం కూడా కలసి రావడంతో రెండు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నాడు–నేడుతో విద్యాభివృద్ధి


రామన్నపాలెం ఎంపీపీ స్కూల్‌లో నాడు–నేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, నాడు–నేడు ద్వారా పాఠశాలలు అద్భుతంగా తయారవుతున్నాయని హెచ్ఎం పైల లచ్చాపాత్రుడు అన్నారు. రాజుపేట శివారు రామన్నపాలెంలోని ఎంపీపీ స్కూల్‌లో సోమవారం నాడు–నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తూ విద్యార్థులకు బంగారు భవితను అందిస్తున్నారన్నారు. ఈ పాఠశాలను రూ.33.42 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారని వచ్చే ఏడాదికి చిన్నారులకు అన్ని వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రాధాన్యంపై వ్యాసరచన పోటీలు


నక్కపల్లిలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నక్కపల్లి : ఓటు హక్కు ప్రాధాన్యంపై సోమవారం నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈనెల 25న ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యం అనే అంశంపై మండల స్థాయిలో ఈ పోటీలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ డి.సుబ్రహ్మణ్యశాస్త్రి తెలిపారు. ఓటు హక్కు ఏవిధంగా పొందాలి, ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి అనే అంశంపై జరిగిన ఈ పోటీలకు పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారని, నక్కపల్లి తెలుగు పండిట్ ఎస్.వి.ఎస్ ఆచార్యులు తెలిపారు. వ్యాసరచనతో పాటు, వక్తృత్వ పోటీలు కూడా నిర్వహించడం జరిగిందన్నారు. 25న ఓటర్ల దినోత్సవం నాడు విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీటీ తాతాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ పాప, హెచ్ఎం రాణి లలిత పాల్గొన్నారు.

గ్రామంలో కోతుల సమస్య పరిష్కారంపై చర్చ

పాయకరావుపేట : మంగవరం గ్రామంలో కోతుల సమస్య పరిష్కరించాలంటూ గ్రామస్తులు గ్రామ సభలో చర్చించారు. గ్రామ సర్పంచ్ వంగలపూడి సరస్వతి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గ్రామస్తులందరూ కోతుల సమస్యపై పంచాయతీ పాలక వర్గం దృష్టి సారించాలని విన్నవించారు. సభకు హాజరైన ఈవోఆర్‌డీ చంద్రశేఖర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సాధారణ నిధుల నుంచి కొంతవరకు కోతుల్ని పట్టించడానికి ఖర్చు చేయవచ్చునన్నారు. గ్రామస్తులు ఆర్థికంగా సహకరిస్తే పూర్తి స్థాయిలో కోతుల్ని పట్టించడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో పన్నులు, ఫీజులు, బకాయిలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ రామారావు, దేవవరపు ఆనంద్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

మునగపాక : మూలపేట రామాలయంలో సోమవారం భరతమాతకు ఘనంగా నివాళులర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భరతమాత పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు కె.వి. రమణ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.

అలాగే సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించాలన్నారు. దేశభక్తిని అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, గ్రామస్తులు రవి, కాశీరావు,శివ పాల్గొన్నారు.

పోషకాలతో రక్తహీనత నివారణ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోటవురట్ల : కౌమార దశలో పోషకాహార లోపం కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్ఎం నాగేశ్వరరావు అన్నారు. కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రక్తహీనత, ఆరోగ్యపు అలవాట్లు, పోషకాహార ప్రాధాన్యతపై సోమవారం అవగాహన కల్పించారు. ఏఎన్ఎం పద్మ మాట్లాడుతూ పోషకాలు అందకపోవడం వల్ల రక్తహీనత వస్తుందని, చిన్నతనం నుంచి మంచి ఆరోగ్యపు అలవాట్లు చేసుకోవాలన్నారు. ప్రతిసారీ చేతులను కడుక్కోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల్లో రక్తహీనత నివారించాలి

మునగపాక : మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని వాడ్రాపల్లిలో ఆయన రక్తహీనత లోపం కారణంగా బాలికల్లో ఎదురయ్యే ఇబ్బందులపై జరిగిన సమావేశంలో మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, అలాగే 10 నుంచి 19 సంవత్సరాల బాలికల్లో రక్తహీనత లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి,మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

డిమాండ్లపై స్పందించే వరకూ ధర్నా

రాంబిల్లి: నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజల ఆందోళనకు సోమవారం నాటికి 85వ రోజులు పూర్తయ్యాయి. డిమాండ్లపై సానుకూల వాతావరణం ఏర్పడే వరకు ధర్నా కొనసాగిస్తామని ఉద్యమ ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు.వాడనర్సాపురం,కొప్పుగొండుపాలెం, కొత్తపట్నం, వాడపాలెం, నేవీ పునరావాసకాలని తదితర గ్రామాల ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళులు


చిన దొడ్డిగల్లులో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


మునగపాకలో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

నక్కపల్లి: మండలంలో చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు.

ఉప్పు సత్యాగ్రహం సమయంలో బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను జైలుకు పంపిందన్నారు. దేశ బహిష్కరణ శిక్ష కూడా విధించిందన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అప్పలరాజు, రాజు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు పాటుపడాలి

మునగపాక : మునగపాక మండల పరిషత్ హాలులో సోమవారం నేతాజీ సుబాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం జరిగింది. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణలు ముందుగా సుభాష్ చంద్రబోష్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీడీవో రవికుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు,వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి, మండల పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.